# ఆహా! విమాన ప్రయాణం

(విమానాల పనితీరు ఆ రోజుల్లోనే కాదు ఇప్పుడూ అలాగే అఘోరించింది.)



**వి**మాన ప్రయాణాలు మా కాలనీ వాళ్ళకు కొత్తేం కాదు.

రెండుమూడు సార్లు ఎయిర్‌పోర్ట్‌కెళ్ళి మా కాలనీ కొచ్చిన కొంతమంది వీఐపీలకు వెల్‌కమ్‌లు, సెండాఫ్‌లు ఇచ్చాం.

మేము వెయిటింగ్ హాల్‌కెళ్ళడం, అక్కడ ఫ్లైట్ ఎనౌన్స్‌మెంట్, సెక్యూరిటీ చెక్ ఎనౌన్స్‌మెంట్స్ వినడం, అప్పుడు తిరిగి ఇళ్ళకు చేరుకోవడం జరుగుతుండేది.

అప్పుడప్పుడూ మాత్రం లోలోపల మాకనిపిస్తుండేది- ఎప్పుడయినా మేమూ విమానంలో ప్రయాణం చేస్తే బాగుంటుందని.

కానీ రైల్లో సరదాగా మాకిష్టమయిన ఊళ్ళు చూడ్డానికే ఆర్థిక స్థోమతులేనివాళ్ళం- అలా విమానాల్లో ప్రయాణం గురించి కలలు కనడం మన డెమొక్రసీకే అవమానం గనుక మా కోరికను లోలోపలే అణచుకునేవాళ్ళం.

అకస్మాత్తుగా ఓ రోజు మా రంగారెడ్డికి టెలిగ్రామ్ వచ్చేసరికి ఎవరికో సీరియస్‌గా వుంది కాబోల్నని అందరం అతని ఓదార్చడానికి గుమికూడాం.

తీరా చూస్తే ఆ టెలిగ్రామ్ భారత్ బ్రాంది కంపెనీ వాళ్ళ దగ్గర్నుంచి వచ్చింది.

వాళ్ళు పెట్టిన "బ్రాంది మేరా సాథీ" కాంపిటీషన్‌లో రంగారెడ్డికి ప్రథమ బహుమతి వచ్చిందని దాని సారాంశం! ప్రథమ బహుమతి అంటే రంగారెడ్డి ఉచితంగా మద్రాస్‌కి విమాన ప్రయాణం- మద్రాస్‌లో ప్రముఖ చలనచిత్ర సెక్స్ డాన్సర్ విద్యతో కలసి ఓ పెగ్గు భారత్ బ్రాంది తాగడం, తర్వాత ఆమెతో లంచ్- ఆ తర్వాత తిరిగి విమానంలో హైదరాబాద్ చేరుకోవడం-

ఆ వివరాలన్నీ తెల్సేసరికి మాతోపాటు రంగారెడ్డి కూడా ఆశ్చర్యపోయాడు.

"ఇదెక్కడి గొడవయ్యా! అసలిలాంటి కాంపిటీషన్ వున్నట్లే నాకు తెలీదే! దీనికి నేను సెలక్టవటమేంటి?" అన్నాడు అయోమయంగా.

ఈలోగా రంగారెడ్డి భార్య కన్నీళ్ళొత్తుకుంటూ బయటికొచ్చింది.

"నాకారోజే అనుమానం వచ్చిందన్నయ్యగారూ ఈ మనిషి తాగేస్తున్నారని! అక్కడికీ నిలదీసి అడుగుతే 'ఛ పిచ్చిదానా! నేను తాగడమేమిటే నీ తలకాయ! మా ఫ్రెండొకడు ఖాళీ చేసిన బాటిల్ బావుందని మనం మంచినీళ్ళు తాగడానికి ఉపయోగించుకోవచ్చనీ తీసుకొచ్చాను- అని అబద్ధం చెప్పారు" అందామె కోపంగా.

ఆమె మాటతో మాకూ రంగారెడ్డి మీద అనుమానం వచ్చింది.

"ఇదేం పని గురూ! నువ్వేం రాజకీయ నాయకుడివా? రోజూ తాగడానికి? మేము ఎప్పుడయినా పార్టీకి ఇన్‌వైట్ చేస్తే న్యూ ఇయర్స్‌డే ఒక్కరోజు తప్ప ఇంకెప్పుడూ తాగనని పెద్ద ఫోజిచ్చేవాడివి కదా!" అన్నాడు శాయిరామ్ ఉడికిపోతూ.

రంగారెడ్డికి తిక్క పుట్టుకొచ్చింది.

"ఏయ్- మీకేం మతుందా లేదా? నేను తాగడమేంటయ్యా! తాగుతున్నానని చెప్తే నాకేం భయమా? ఈ భారత్ బ్రాందీ గొడవేంటో నాకేమాత్రం తెలీదు. ఎవరో నన్ను అభాసుచేయడానికి వేసిన ప్లాన్" అన్నాడు నెత్తీ నోరూ కొట్టుకుంటూ.

అందరం కన్ఫ్యూజన్‌లో వుండగా మావెనుక సెపరేట్‌గా కూర్చుని దీర్ఘంగా నిట్టూరుస్తూ కనిపించాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్.

అందరం వెనక్కు తిరిగి అతనివేపు చూశాం.

"నీకేమొచ్చిందయ్యా- అలా ఒక్కడివే దూరంగా కూర్చుని ఏడుస్తున్నావ్?" అడిగాడు గోపాల్రావ్ అనుమానంగా. అడగడం ఆలస్యం- ఒక్కసారిగా భోరుమన్నాడతను.

"ఏడవకేం చేయను గురూ! నా బ్రతుక్కి "లక్" అనేది ఏ కోశానా లేదు. ఇప్పుడే కాదు. నా చిన్నప్పటినుంచీ ఇంతే! క్లాస్ టెస్ట్ పెట్టినప్పుడల్లా క్లాస్‌లో నేనే ఫస్ట్ వచ్చేవాడిని. తీరా యాన్యువల్ ఎగ్జామ్స్ వచ్చేసరికి ఏదొక ఆన్సర్ మర్చిపోవడం- రమణ గాడికి ఫస్ట్ మార్కులు రావడం జరిగేది. అందాకా ఎందుకు కాలేజీలో చదివేప్పుడు ఆరునెలలు కామేశ్వరి ఇంటి చుట్టూ తిరిగినందుకు ఆ అమ్మాయి జాలిపడి ఫలానా రోజు సినిమాకు రమ్మని రాసిన వుత్తరం మా రూమ్మేట్‌కి దొరికింది. వాడు ఝామ్మంటూ ఆమెతో సినిమా కెళ్ళి- చివరకు ఆమెనే పెళ్ళి కూడా చేసేసుకున్నాడు. వీటన్నికంటె దారుణమయిన విషయం ఏమిటంటే- నేను ఆ రోజుల్లోనే వెరయిటీ నవల రాయాలని చేతబడికి సంబంధించిన వివరాలన్నీ ఆంధ్రప్రదేశ్ అంతా తిరిగి సేకరించాను. నవల సగం రాశాక రెండు నెలలు బద్దకించేసరికి యండమూర్తి కాస్తా ఆ నవల రాసి క్రెడిట్ కొట్టేశాడు. అందాకా ఎందుకూ మొన్నటికి మొన్న- ఫారెస్ట్ మీద నవల రాయాలని మా కజిన్ బ్రదర్ ఫారెస్ట్ రేంజర్‌గా పని ఏస్తున్న ఓ అడవి కెళ్ళి అడవులకు సంబంధించిన వివరాలన్నీ సేకరించుకొని నవల రాయడం మొదలు పెట్టానో లేదో ఇంకో రచయిత అదే సబ్జెక్ట్‌తో సీరియల్ మొదలు పెట్టేశాడు..."

మేము అడ్డుపడకపోతే అతనలా అన్నం, నీరు లేకుండా యుగాల తరబడి చెప్తూనే వుంటాడని మాకు అనుభవపూర్వకంగా తెలీడం వల్ల ఠక్కున అతని నోరు మూసేశాము.

"అదంతా ఎందుగ్గానీ ఇప్పుడు నీ ఏడుపుకి కారణం ఏమిటో చెప్పు చాలు" అన్నాడు జనార్ధన్.

"అదే చెపుతున్నా గురూ! నాకు చిన్నప్పటినుంచీ-"

"అదే వద్దన్నాను ఇప్పటి సంగతి మాట్లాడు! చిన్నప్పటి సంగతి చెప్పకు" కోపంగా అన్నాన్నేను.

"ఇప్పటి సంగతే చెపుతున్నా గురూ! నాకు చిన్నప్పటినుంచి 'లక్' లేదని చెప్పాను కదా! ఎన్నో వందలసార్లు నేను పూర్తి చేసిన క్రాస్‌వర్డ్ పజిల్స్, రకరకాల పోటీలు ఎన్నో కేవలం వెంట్రుక వాసిలో తప్పిపోతుండేవి! దానర్థం ఏమిటి? నాకు అన్నీ వున్నాయ్ గానీ నా పేరుకి 'లక్' లేదనే గదా! అందుకే మొన్న భారత్ బ్రాందీ వాళ్లు పెట్టిన స్లోగన్ పోటీలో స్లోగన్ రాసి రంగారెడ్డి పేరు మీద పంపించాను. అందుకే రంగారెడ్డికి మొదటి బహుమతి వచ్చింది. ఇప్పుడు రంగారెడ్డే విమానంలో మద్రాస్ వెళ్ళి సినీ స్టార్ విద్యతో భారత్ బ్రాందీ ఒక పెగ్ తాగి డిన్నర్ చేసి" ఇంక చెప్పలేక మళ్ళీ భోరుమని ఏడ్చాడతను.

అప్పటిగ్గానీ మాకు సంగతంతా అర్థం కాలేదు. చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మీద అందరికి విపరీతమయిన జాలి కలిగింది.

"బెటర్ లక్ నెక్ట్స్‌టైమ్" అంటూ ఓదార్చి అతనింటివరకూ తీసుకెళ్ళి వాళ్ళావిడకు అప్పజెప్పాము.

"ఈ రాత్రి కొంచెం మీ ఆయన్ని జాగ్రత్తగా చూస్తుండమ్మా! ఏమయినా అఘాయిత్యం చేసినా చేయవచ్చు" అని హెచ్చరించాం ఆమెను.

మేము తిరిగి వచ్చేసరికి రంగారెడ్డి తను జరుపబోతున్న విమాన ప్రయాణం గురించి చాలా ఉత్సాహంగా అందరితో చర్చిస్తున్నాడు.

"నేను గుంటకల్లో పనిచేసేప్పుడు ఓ కొండదొర చెప్పాడు గురూ– థర్టీఫైవ్ ఇయర్స్ ఏజ్ దాటాక విమాన ప్రయాణం చేస్తానని! అచ్చం వాడు చెప్పినట్లే జరుగుతోంది. వాడు సామాన్యమయిన కొండదొర కాదు! మన ప్రెసిడెంట్‌కీ, ప్రధానమంత్రికి కూడా వాడే చెప్పాడు" అందరికీ రంగారెడ్డిని చూస్తే ఈర్ష్యగానూ వుందీ, మేం చేయలేని పని అతను చేస్తున్నాడన్న ఆనందమూ కలుగుతోంది.

ఆ రోజు నుంచీ రంగారెడ్డి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. పొద్దున్నే కాలనీలో కొచ్చిన కూరగాయల బండివాడిని ఆపేశాడు.

"టమాటో ఎంత కిలో?" అడిగాడు రెడ్డి.

"మూడ్రూపాయల్సార్"

"ఏం రాజయ్యా? నేను ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళుతున్నాననా ఏమిటి, ధరలు కూడా ఆకాశాన్నంటించేస్తున్నావ్! నేను వెళ్ళేది ఒక్క రోజేనయ్యా బాబు! ఆ సినిమా స్టార్ విద్యతో డిన్నర్ అవగానే మళ్ళా గంటలో హైదరాబాద్ చేరుకోనూ? సినిమా స్టార్‌తో డిన్నర్ తీసుకుంటే నాకేం కొమ్ములొస్తాయా ఏమన్నానా? నువ్ టమాటో మూడు రూపాయలు చెప్తే ఎలా?"

"ఏంటి సార్? ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళుతున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు

రాజయ్య.

"తప్పేట్లు లేదు! ఆ భారత్ బ్రాంది కంపెనీ వాళ్ళు మొండి బలవంతం చేస్తున్నారు. నాకేమో ఇక్కడ ఆఫీసులో చచ్చేంత వర్క్ వుంది. సెలవు ఇస్తారో ఇవ్వరో తెలీదు. వెళ్ళకపోతే ఆ భారత్ బ్రాందీ వాళ్ళూ, ఆ సినీ స్టార్ ఏమనుకుంటారోనని మళ్ళీ అదొకటి! పోనీలేగదాని ఆహ్వానిస్తే వీడికింత టెక్కా అనుకోరూ! మన గొడవలు వాళ్ళకేం తెలుస్తాయ్!"

"సినిమా స్టార్ విద్యతో డిన్నర్ చేస్తారా సార్?" మరింత ఎగ్జైట్ అయిపోతూ అడిగాడు రాజయ్య.

"వాళ్ళ మాట కాదని అనలేం కదా! సరదాగా చేయక తప్పదిక"

"అబ్బ! ఎంత అదృష్టం సార్ మీది?"

"ఆ– మనకిలాంటివి అసలు ఇంట్రెస్టు వుండవోయ్ ఏదో ఒక...."

ఆ సాయంత్రం మా ఆఫీస్ కాంటీన్‌లో టీ తాగి వక్కపొడి కొనుక్కుంటున్నప్పుడు మళ్ళీ ఫోజు ప్రారంభించడం మాకు వినిపించింది.

"ఇదిగో– రాములూ ఒక వక్కపొడి పొట్లాం ఇవ్వు! అన్నట్టు మర్చిపోయాను ఎల్లుండి విమానంలో మద్రాస్ వెళ్ళి సినీస్టార్ విద్యతో డిన్నర్ చేయాలి! విమానంలో కొంచెం తిప్పినట్లుంటుందట కదా! అలాంటప్పుడు ఉపయోగించడానికి స్పెషల్ వక్కపొడి ఏదయినా వుందా మన దగ్గర?" ఇలా అడుగడుగునా తన మద్రాస్ విమాన ప్రయాణం గురించి బలవంతంగా అందరికీ చెపుతూనే వున్నాడు.

రెండు రోజుల్లో భారత్ బ్రాంది కంపెనీకి చెందిన ఓ సేల్స్ మేనేజర్ స్వయంగా మా కాలనీ కొచ్చి రంగారెడ్డికి ఫ్లైట్ టికెట్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం ఎనిమిదీ యాభైకే విమానం.

ఆ రాత్రి మాకెవరికీ నిద్రపట్టలేదు.

రంగారెడ్డి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేస్తూనే వున్నాం. రంగారెడ్డి మాత్రం బయట మా కాలనీ ఘూర్కాతో మాట్లాడుతున్నాడు.

"రేప్పొద్దునే లేసి విమానంలో మద్రాసెళ్ళాలోయ్! అందుకని ఈ రాత్రికి పెందలాడే నిద్రపోతాను. కొంచెం నువ్వు ఇవ్వాళ ఎర్లీగా రౌండ్స్ కొట్టడం మంచింది" చాలా కాజువల్‌గా మాట్లాడుతున్నట్టు నటించసాగాడతను.

"రేపు విమానంలో మద్రాసెళ్తున్నారా సాబ్?"

"పర్సనల్‌గా నాకు విమాన ప్రయాణం ఇష్టం వుండదనుకో– ఆ కంపెనీ వాళ్ళు బలవంతం చేయడం వల్ల"

"ఆహా! అదృష్టం సార్ మీది"

"ఆ విమాన ప్రయాణం దేముందిలే ఈ రోజుల్లో వెయ్యి రూపాయలు పారేస్తే ఢిల్లీ వెళ్ళవచ్చు"

రాత్రి తొమ్మిది గంటలకు రంగారెడ్డి ఇంటి దగ్గర్నుంచి అందరం ఎవరిళ్ళకువాళ్ళు బయల్దేరబోతుంటే జనార్ధన్ ఓ ఇంగ్లీష్ డెయిలీ తీసుకుని హడావుడిగా వచ్చాడు.

"గురూ! మొన్న గౌహతిలో జరిగిన వాయుదూత్ విమాన ప్రమాదం గురించి ఇందులో రాశారు చూశారా?" అడిగాడు గాబరాగా.

ఆ మాటలతో అందరం ఎలర్ట్ అయిపోయాం.

"ఏం రాశారు?" అడిగాడు రంగారెడ్డి అనుమానంగా.

"ఆ రోజు కంట్రోల్ టవర్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఎక్కడికో వెళ్ళాడట... అక్కడ బిల్స్ రాసుకుని రికార్డులు మెయింటెయిన చేసే అసిస్టెంట్ ఫ్లైట్ కాప్టెన్‌కి ఆదేశాలు ఇచ్చేశాడు. దాంతో ఆ విమానం కొండక్కొట్టుకుని మటాష్ అయిపోయిందిట."

అందరికీ ఆశ్చర్యం కలిగింది.

"అదేమిటి? ట్రాఫిక్ కంట్రోలర్ డ్యూటీ అసిస్టెంట్ చేసేస్తూంటాడా?" అడిగాడు శాయిరామ్.

"అదే! మన రైల్వేలే కూడా అంతేగా? డ్రైవర్ ఎవరితోనయినా హస్కీ కొడుతుంటే అసిస్టెంట్లు నడిపేస్తుంటారు" అన్నాడు అప్పలాచారి.

"అవునవును! గార్డు డ్యూటీ ఒకోసారి బఠానీలవాడు చేస్తూంటాడు కదా"

"అన్ని చోట్లా అది మామూలే లేవోయ్! లారీ డ్రైవర్లు నిద్రపోతుంటే క్లీనర్లు నడపడం అందరికీ తెలిసిందేగా?"

"కానీ వాటి సంగతివేరు, విమానం సంగతివేరు"

"అది మిగతా దేశాల్లో సంగతి. మనదేశంలో అన్నీ ఒకటే. మినిష్టర్లు చేసే పనులు సెక్రటరీలు చేస్తుంటారు. సెక్రటరీలు చేసే పని డిపార్టుమెంట్ ఆఫీసర్లు చేస్తుంటారు"

యాదగిరి జనార్ధన్ చేతిలోనుంచి ఆ పేపర్ తీసుకుని చకచక చదవసాగాడు.

"అరె బాప్రే! దిసీజ్ టూ మచ్ భాయ్" అన్నాడు గుండెలు బాదుకుంటూ.

"ఏమిటి?" మరింత ఆత్రుతగా అడిగాడు రంగారెడ్డి.

"ఏమాత్రం అనుభవంలేని పైలెట్లు ప్రస్తుతం ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలు నడుపుతున్నారట!" అందరం ఉలిక్కిపడ్డాం.

"ఏమాత్రం అనుభవం లేనివాళ్ళా?"

"ఏమాత్రం అంటే చాలా తక్కువ"

"ఎందుకలా చేస్తున్నారు వాళ్ళు?"

"షార్టేజ్ భాయ్! ఆర్టీసీవోళ్ళు స్ట్రైక్ చేసినప్పుడూ, రైల్వేవోళ్ళు స్ట్రైక్ చేసినప్పుడూ గవర్నమెంట్ ఎవర్నంటే ఆళ్ళను డ్రైవర్లు జేసి నడిపించడంలే? గప్పుడే గదా యాక్సిడెంట్లయి ప్రయాణం జేసేటోళ్ళందరూ దేవతలయిపోతున్రు! ఇది కూడా గట్లనే"

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి భయంగా.

"గంతేకాదు ఇన్‌స్ట్రుమెంట్ లాండింగ్ ప్రోగ్రాంభీ మంచిగా లేదంట. రాడార్ ఫెసిలిటీ ఎన్నో ఎయిర్‌పోర్ట్స్‌లో లేవంట. కంట్రోల్ టవర్స్‌లో స్టాఫ్ ఎప్పుడూ తక్కువేనంట. దీనికితోడు షార్టేజ్ ఆఫ్ ఇంజనీర్స్! అందుకని విమానాల్లో చిన్నచిన్న సాంకేతిక లోపాలున్నా అలాగే ఎగురుతుంటాయన్నమాట. చాలా ఎయిర్‌పోర్ట్సులో 'రన్‌వే' మొదలయినట్లు సూచించే ఎప్రోచ్‌లైట్స్ కూడా పనిచేయడం లేదంట– కారణ ఏమిటంటే వాటిల్లోని బల్బులు ఎక్కువగా దొంగిలింపబడుతున్నాయి గనుక మాట్లాడితే కొత్త బల్బులు వేయడం కుదరదంటున్నారు"

అప్పటికే రంగారెడ్డి ముఖంలో భయం స్పష్టంగా కనిపించింది మాకు.

ఎందుకయినా మంచిదని యాదగిరి దగ్గర్నుంచీ పేపర్ లాక్కుని చింపి అవతల పారేశాం.

"ఆ! ఇవన్నీ మామూలేలే– మన దేశంలో ఏ ఫీల్డ్ తీసుకున్నా ఇలాగే అవకతవక లుంటాయి మరి! ఈ మాత్రానికే బెదిరిపోతే ఎలా?"

"అందాకా ఎందుకు? మనదృష్టం బాగుండాలేగానీ లేకపోతే మన గవర్నమెంట్ పరిపాలనకు ఇంట్లోనే చావమా ఏమిటి? గవర్నమెంట్ కట్టిన హౌసింగ్‌బోర్డ్ ఇళ్ళు కూలిపోతే అందులో వున్నాళ్ళు తప్పించుకోగలరా? ఫ్యాక్టరీల తాలూకూ పొల్యూషన్ ఆ చుట్టుపక్కల వున్న నీళ్ళల్లో కొచ్చి ఆ నీళ్ళు తాగినవాళ్ళు చావకుండా తప్పించుకోగలరా? కల్తీ ఆహారం సరేసరి! స్లోపాయిజనింగే కదా! గూండాలు సరదాగా కత్తులు తీసుకుని రోడ్‌మీద వెళ్ళేవారిని పొడిచి నవ్వుకోవడం, పోలీసులు లాకప్‌లో ఎదురుతిరిగినవాళ్ళను చట్నీ చేసెయ్యడం– వీటికంటే విమాన ప్రయాణం ప్రమాదకరమైనదా ఏంటి?" రెడ్డికి ధైర్యం చెపుతూ అన్నాడు శాయిరామ్.

"అవునవును! మనకేం భయం లేదులే" అన్నాడు రెడ్డి ధైర్యం తెచ్చుకుంటూ. అదీగాక మనవి అంత తేలిగ్గాపోయే ప్రాణాలయితే మన రాష్ట్ర రాజధానిలో వుంటూ కూడా ఇంతకాలం బ్రతికి ఉండేవాళ్ళమా?"

అందరం ఇళ్ళకు చేరుకున్నాం.

ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్టు చేరుకున్నాం. ఎంట్రెన్స్ టికెట్ తీసుకుని లోపలకు వెళ్ళాం.

అప్పటికే బాంబే, డిల్లీ ఫ్లైట్స్ కోసం జనం నిండిపోయి వున్నారు.

భారత్ బ్రాందీ కంపెనీ తరపు సేల్స్ ఆఫీసర్ రంగారెడ్డిని కల్సుకున్నాడు.

"మీకిచ్చిన టికెట్ ఆ కౌంటర్‌లో చూపించి కన్‌ఫరమ్ చేసుకోండి" చెప్పాడతను.

వెళ్ళి క్యూలో నిలబడ్డాడు రంగారెడ్డి. కాసేపటి తరువాత బోర్డింగ్ టికెట్ తీసుకుని మా దగ్గరకొచ్చాడు మళ్ళీ.

వేరే నగరాలకు వెళ్ళే ప్రయాణీకులు సెక్యూరిటీ చెక్‌కోసం క్యూలో నిలబడ్డారు.

హఠాత్తుగా ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

ఢిల్లీ నుంచి మద్రాస్ వెళ్ళే బోయింగ్ అప్పుడే లాండ్ అయిందని...

రంగారెడ్డి మొఖంలో కొంచెం భయం కనబడుతూనే వుంది.

గంటయినా సెక్యూరిటీ చెక్‌కి ఎనౌన్స్‌మెంట్ రాకపోయేసరికి ప్రయాణికులందరూ ఎంక్వయిరీ కౌంటర్ దగ్గర గుమికూడారు.

"మరేం లేదండీ! ఒకసైడ్ రెక్క కొంచెం లూజ్ అయిందట... అందుకని ఆలస్యం అవుతోంది" అందామె.

మా గుండెల్లో రాయిపడినట్లయింది.

సరిగ్గా అప్పుడే ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

"ప్రయాణీకుల్లోగానీ, వారికి సెండాఫ్ ఇవ్వడానికి వచ్చినవారిలో గానీ వెల్డింగ్ తెలిసిన వెల్డర్స్ ఎవరయినావుంటే వెంటనే ఎయిర్‌పోర్ట్ మేనేజర్ని కలుసు కోవలసిందిగా కోరుతున్నాం!"

రంగారెడ్డి మొఖం పాలిపోయింది.

ఈలోగా ఓ పైలట్ హడావుడిగా మరో ఎయిర్‌పోర్టు అధికారి దగ్గరకు పరుగెత్తు కొచ్చాడు.

"బాక్‌ట్యూబ్ పంచరయినట్లుంది సార్... గాలి తగ్గిపోయింది. ఆ రోడ్‌మీద పంక్చర్స్ వేసే కుర్రాడిని పిలిపించండి! అర్జెంట్" చెప్పాడతను.

వెంటనే ఆ కుర్రాడిని తీసుకురావడానికి ఎయిర్‌లైన్స్ కారు దూసుకెళ్ళిపోయింది బయటకు.

"మా కో- పైలట్ పని చేయనంటున్నాడు! ఇక్కడింకెవరయినా దొరుకుతారేమో చూడండి."

"అదేమిటి? ఎందుకు పనిచేయడు?"

"అతను ఇప్పటికే షార్టేజ్‌వల్ల రెస్ట్‌లేకుండా పనిచేస్తున్నాడు."

"కానీ ఇంత సడెన్‌గా ఇక్కడ కో- పైలట్ ఎవరు దొరుకుతారు?"

"ఎవరోకరిని చూడండి! మద్రాస్‌కి గంట ప్రయాణమేగా! నేనే ఎలాగోలా మానేజ్

చేసుకుంటాను! నా పక్కన కూర్చుని నేను నొక్కమన్న మీటలునొక్కి, రివర్స్ గేర్ లాగగలుగుతే చాలు."

ఎయిర్‌పోర్ట్ అధికారి ఓ క్షణం ఆలోచించాడు.

"మా బామ్మర్ధిని తీసుకెళ్ళండి! వాడికి పాపం చిన్నప్పటినుంచీ విమానం పైలట్ అవ్వాలని కోరిక! అదృష్టం బావుండక ఫైరింజన్ డ్రైవరయాడు గానీ లేకపోతే..."

పైలట్ ఓ క్షణం ఆలోచించాడు.

"అతనికి విమానాల గురించి ఏమయినా తెలుసా?"

"తెలీటమా? మొత్తం ఎనిమిది రకాల విమానాల బొమ్మలున్నాయి వాళ్ళింటి అల్మారాలో! ఒకోటీ ఆరొందలు పెట్టి కొన్నాడు. అవి చెడిపోతే వాడే రిపేర్ చేసుకుంటాడు"

"ఆమాత్రం వస్తే ఇంకేం కావాలి? మాకో–పైలట్ కంటే నయం కదా? వాళ్ళింట్లో నాలుగే బొమ్మలున్నాయట!"

వాళ్ళు మాట్లాడుతుండగానే ఇంకో అధికారి పరుగుతో వచ్చాడు.

"సార్ విమానం ఫ్లోరింగ్ సింక్ అవుతోందిట! ఎలా ఇప్పుడు!"

"మనమేం చేయగలం? ఇంజనీర్లు షార్టేజ్ కదా! ఎలాగోలా మద్రాస్ దాకా వెళ్ళేలా చూడమని మన కార్పెంటర్‌తో చెప్పు"

"కార్పెంటర్ చూసి అయిదారుచోట్ల చెక్కముక్కలు వేసి మేకులు కొట్టాడుసార్! అయినాగానీ ముందు వరుసలో కూర్చున్న వాళ్ళకాళ్ళు కిందకు వేలాడుతున్నాయ్"

"గంటసేపు జర్నీయే కదయ్యా! కాళ్ళు సీట్లో పెట్టుకుని కూర్చోమను"

అతను వెళ్ళగానే ఇంకోవ్యక్తి వచ్చాడు.

"సార్! బోయింగ్‌లో కాఫీ ఫలహారాలు అన్నీ అవుటాఫ్ స్టాక్. ఏం చేయమంటారు?

"మన కాంటీన్ నుంచి సప్లయ్ చేయండయ్యా"

"మన దగ్గర కూడా లేవు సార్! నిన్న పండగ కదా! కంట్రాక్టర్ రాలేదు."

"అయితే బయట రోడ్‌పక్కన ఒకడు పొయ్యి, కళాయి పెట్టుకుని బజ్జీలు చేస్తున్నాడు చూడు. వాడి దగ్గర వున్నవన్నీ కొనేసి సప్లయ్ చేయండి."

"సార్" కౌంటర్ దగ్గర్నుంచి ఒకామె పిలిచింది. "మీకు ఫోన్! కంట్రోల్ టవర్ నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ పిలుస్తున్నాడు"

అతను పరుగుతో వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.

"సార్ మా ఆవిడా, పిల్లలూ రైల్లో అమెరికా వెళుతున్నారు. స్టేషన్‌కెళ్ళి సెండాఫ్ ఇచ్చి వస్తాను. అంతవరకూ నా బదులు మా ఆఫీస్ స్వీపర్ నా డ్యూటీ చేస్తాడు. మీ ఫర్మిషన్ అడుగుదామని"

“నీ డ్యూటీలు రోజూ చేసేది వాడే కదయ్యా– ఇవాళ పర్మిషనెందుకు ప్రత్యేకంగా?”

“ఎందుకంటే– నిన్న వాడి పొరబాటువల్లే కదా– ఆ వాయుదూత్ ముక్కలయింది. అందుకని వాడిని కోప్పడ్డారట ఎంక్వయిరీలో! వాడికి కోపం వచ్చింది. మీరు వప్పుకుంటేగానీ చేయనంటున్నాడు.”

“సరే– మాట్లాడమను వాడిని”

“హల్లో అంగముత్తూ ఏం ఫర్లేదులే! ఇవాళ ప్లేన్లు పడినా నిన్నే మీ అనంగానీ– కొంచెం చూస్కో– మన రాజ్‌సింగ్ స్టేషన్‌కు వెళ్ళి వచ్చేవరకూ–”

ఫోన్ పెట్టేశాడతను.

అప్పుడే మళ్ళీ పైలట్ ఇంకో వ్యక్తితో పాటు హడావుడిగా వచ్చాడు.

“సార్– ఈ మీటియోరోలాజికల్ వాళ్ళ వెదర్ రిపోర్ట్‌మీద నిన్నటి తారీఖుంది– అదేమంటే ఇష్టమయితే తీసుకో– లేకపోతే పొమ్మంటున్నాడు. పదిహేను రోజుల్నుంచీ ఇదే రిపోర్ట్ ఇస్తున్నాడు.’

వెదర్ రిపోర్ట్లు తెచ్చిన అధికారి కస్సుమంటూ లేచాడు.

“వెదర్ నిన్నటి వెదర్‌లాగానే వుందయ్యా! అసలు పదిహేను రోజుల్నుంచీ మారటం లేదది! నేనేం చేయను? అందుకని అదే ఇచ్చాను కావాలంటే డేట్ మార్చి రాస్తాను ఇటివ్వు”

“అవతల ఏరోడ్రోమ్ అంతా మంచుపట్టి భీకరంగా వుంటే వెదర్ క్లియర్ అని ఎలా రాస్తావయ్యా!”

“నువ్వెక్కడో పిచ్చాడిలాగున్నావే యాక్చువల్ వెదర్‌కీ, వెదర్ రిపోర్టుకీ సంబంధం ఎందుకుంటుందయ్యా! దాని దారిదాన్దే! కావాలంటే ఇవాల్టికి నా బైనాక్యులర్స్ ఇస్తానుగానీ– ఈ రిపోర్ట్ తీసుకుని సంతకం చెయ్! రేపు కావాలంటే వెదర్ రిపోర్ట్ మారుస్తాను.”

ఆ అధికారి ఇద్దరికి సర్ది చెప్పాడు.

“ఇవాల్టికి పోనీవయ్యా! రేపట్నుంచీ రోజుకోరకంగా మార్చి వెదర్ రిపోర్ట్ ఇస్తానంటున్నాడుగా”

పైలట్ గొణుక్కుంటూ సంతకం చేసి వెదర్ అధికారి మెడలోని బైనాక్యులర్స్ తీసుకుని వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే వెల్డింగ్ మిషన్‌తో ఓ వ్యక్తి వచ్చాడక్కడికి.

“ఏం సార్! మొత్తం ఒక సైడ్ రెక్కంతా వెల్డింగ్ చేసినా ఆర్రూపాయలేనా సార్! ఇదే నేను బస్‌కి చేస్తే అరవై రూపాయలు చార్జ్ చేస్తాన్సార్!”

“మరి ముందు ఆర్రూపాయలు అన్నావ్ కదయ్యా!”

"రెక్క చివర్లో కొంచెం వెల్డింగ్ అంటే నిజంగా కొంచెమే అనుకున్నాను సార్! తీరా చూస్తే మొత్తం విరిగి వేలాడుతోంది. అందుకని స్ట్రాంగ్‌గా వెల్డింగ్ చేసి పారేశాను. మద్రాస్ చేరేవరకూ ఊడదది! కావాలంటే చూస్కోండి"

"సరే ఇంతకూ ఇప్పుడెంతిమ్మంటావ్!"

"నలభై రూపాయలివ్వండి"

"అంత డబ్బిస్తే రేపు మాకు ఆడిట్ అబ్జెక్షన్ వస్తుందిరా!"

"అయితే ఓ పని చేయండి సార్! ఈడు మా చిన్నమ్మ కొడుకు. వెల్డింగ్, ఫిట్టర్ పనులు జబర్దస్త్ చేస్తాడు. జర ఈడిని మీ ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగంలోకి తీసుకోండి. మీ దగ్గర ఇంజనీర్లు షార్టున్నారని 'ఇండియాటుడే' లో రాశారు కదా"

ఎయిర్‌పోర్ట్ అధికారి ఓ క్షణం ఆలోచించాడు.

"అచ్చా! సరే– ఇప్పుడే పనిలో చేరమను"

వాడి తమ్ముడు ఆనందంగా సెల్యూట్ కొట్టాడు.

"వెళ్ళరా! ఆ మూల రూమ్‌లోకెళ్ళి నేను చెప్పానని చెప్పి ఇంజనీర్ డ్రస్ వేసుకో పో."

"సరిగ్గా అప్పుడే ఎనౌన్స్‌మెంట్ ప్రారంభమయింది. మద్రాస్ ప్రయాణీకులు సెక్యూరిటీ చెక్‌కెళ్ళాలని!

రంగారెడ్డి కెవ్వున కేకవేసి ఎయిర్‌పోర్ట్ బయటకు పరుగెత్తడం ప్రారంభించాడు.

అందరం అతని వెనుక పడ్డాం!

అప్పుడు మెలకువ వచ్చింది నాకు. గుండె వేగంగా కొట్టుకుంటోంది. బయట రంగారెడ్డి గొంతు గట్టిగా వినబడుతోంది. ఓరినీ! ఇదంతా కలా?"

లేచి వాళ్ళింటివేపు నడిచాను. అప్పటికే టైమ్ అయిదవుతోంది. అచ్చం నాకు వచ్చిన కలలాంటిదే తనకూ వచ్చినట్లుంది. అంతా వర్ణించి అందరికీ చెపుతున్నాడతను.

అందరం అతనికి ధైర్యం చెప్పి ఎయిర్‌పోర్టుకి బయల్దేరదీశాము.

సెక్యూరిటీ చెక్ ఎనౌన్స్‌మెంట్‌కోసం ఎదురు చూస్తూండగా వినిపించింది ఎనౌన్స్‌మెంట్.

"మద్రాస్ ఫ్లైట్ తాలూకూ లాండింగ్ గేర్ జామ్ అయిపోవడం వల్ల బాంబే నుంచి ఇంజనీర్స్ వచ్చి రిపేర్ చేయవలసి వుంది. అంచేత ఈ ఫ్లైట్ రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరును. ప్రయాణీకులు తను లంచ్ కూపన్స్ కౌంటర్ దగ్గర కలెక్ట్ చేసుకోవచ్చును."

రెడ్డి ముఖంలో భయం స్పష్టంగా కనిపించసాగింది. కాళ్ళూ చేతులూ వణుకు




తున్నాయ్?

"చూశారా! అదృష్టం మనయందుండబట్టే లాండింగ్ గేర్ ఇక్కడే జామ్ అయింది. ఇదే ఆకాశంలో వుండగా ఫెయిలయితే ఏమయిపోయుండేవాడిని" అన్నాడు గాబరాగా.

"పద మళ్ళీ సాయంత్రం ఎనిమిదింటికి వద్దాం" అన్నాడు శాయిరామ్.

"ఊహూ! వద్దు బ్రదర్! నేనసలు విమానంలో మద్రాస్ వెళ్ళను. నాకు ఇంకొన్ని రోజులు బ్రతకాలని వుంది" అంటూ కౌంటర్ దగ్గర కెళ్ళి టికెట్ కేన్సిల్ చేసుకున్నాడు.

అందరం అతనిని వెంబడించాం ఇంక చేసేదేమీలేక.

* * * * *